RNI. No. APTEL/2011/41055





# ప్రభాత సమాచారం

తెలంగాణ తెలుగు దినపత్రిక




సంపుటి : 12 సంచిక : 265 | ఆదిలాబాద్ | ఎడిటర్ - సయ్యద్ కరీం | శుక్రవారం, 29 మార్చి 2024 | పేజీలు : 4 | వెల : 2/-




# పకడ్బందీగా రైతు రుణమాఫీ

## ఆ తప్పులు పునరావృతం కాకుండా జాగ్రత్తలు

## బ్యాంకులతో ఇప్పటికే చర్చించిన సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: రైతు రుణమాఫీపై రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. గతంలో జరిగిన తప్పులు పునరావృతం కాకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇప్పటికే బ్యాంకులతో దీనిపై చర్చించారు. ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం రూ.2 లక్షల వరకు పంట రుణాల మాఫీకి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని అధికార వర్గాలు చెబుతున్నాయి.


గతంలో లక్ష రూపాయల వరకు పంట రుణాలు మాఫీ చేస్తామని చెప్పి అధికారం చేపట్టిన బీఆర్ఎస్ రుణమాఫీ చేసేందుకు రకరకాల కొర్రీలు పెట్టిందని ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పదేపదే ఆరోపణలు గుప్పించిన సంగతి తెలిసిందే. రాష్ట్రంలో మొత్తం 40.66 లక్షల మంది రైతులకు రూ. 25,916 కోట్లు మాఫీ చేయాల్సి ఉండగా.. కుటుంబ సభ్యుల్లో ఒకరికి మాత్రమే వర్తిస్తుందని కొర్రీ పెట్టి లబ్ధిదారుల సంఖ్యను కుదించిందని ధ్వజమెత్తింది. మరోవైపు అయిదేళ్ల పాటు వంతుల వారీగా రుణమాఫీ నిధులు విడుదల చేసిన అప్పటి ప్రభుత్వం.. చివరకు కేవలం 23 లక్షల మంది రైతులకే రుణ మాఫీ చేసినట్టుగా అధికారులు లెక్కలు తేల్చినట్టు సమాచారం. దాదాపు 14 లక్షల మంది రైతులకు రుణమాఫీ సొమ్ము ఎగవేసినట్టుగా లెక్కగట్టారు. ఈ నేపథ్యంలో గతంలో జరిగిన తప్పులు జరగకుండా అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేసే ప్రతిపాదనలపై మొదటి వంద రోజుల్లోనే కసరత్తు మొదలు పెట్టినట్లు అధికారులు చెబుతున్నారు.

# మాజీ మంత్రి గారివి అర్థం లేని విమర్శలేనా...?

హైదరాబాద్ : క్లారిటీ ఇవ్వలేనప్పుడు ఏం చేయాలి. మరింత కన్ఫ్యూజ్ చేయాలి.. విమర్శలకు సమాధానం చెప్పలేని స్థితిలో ఉన్నప్పుడు. అర్థంలేని ప్రతివిమర్శలు చేయాలి.ఇదే ఇప్పుడు తెలంగాణలో బీఆర్ఎస్ చేస్తున్న పని. ఫోన్ ట్యాపింగ్‌పై సమాధానం చెప్పలేరు. లిక్కర్ కేసుపై నోరు తెరవలేరు. కబ్జాలపై నోరు మెదపలేరు. అలాగని సైలెంట్‌గా ఉంటే అసలుకే మోసం. ప్రాజెక్టుల ఊసే ఎత్తలేరు. అందుకే కొత్త పాట పాడుతున్నారు. ఏనాడో మరిచి.. ఎన్నడూ పట్టించుకోని రైతన్న రాగం ఎత్తుకున్నారు.. రైతులను ఆదుకోవాలి. సాగునీరు అందించాలి. రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలి. పంటలు ఎండిపోతున్నాయి.. సాయం చేయాలి. రుణమాఫీ ప్రకటించాలి. పంట రుణాలు తీసుకున్న వారికి బ్యాంకర్ల వేధింపులు ఎక్కువయ్యాయి. ప్రభుత్వం రైతులను పట్టించుకోకపోతే.. లక్షలాది రైతులతో సెక్రటేరియట్‌ను ముట్టడిస్తాం. ఇది బీఆర్ఎస్ నేత హరీష్‌రావు చేస్తున్న వ్యాఖ్యలు.. అంతా బాగానే ఉంది.. మరి నిజంగా పరిస్థితి అలానే ఉందా? హరీష్‌రావు వ్యాఖ్యలకు అప్పుడే కొంచెం కాదు. చాలా ఎక్కువగానే కౌంటర్లు వచ్చాయి. అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులను ఆదుకుంటామన్నారు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల..

పదివేలు పరిహారం ప్రకటిస్తామని ఎప్పుడో హామీ ఇచ్చారు. సాగునీరుపై మంత్రి జూపల్లి ఇప్పటికే సమాధానమిచ్చారు. నిజానికి కేసీఆర్ పదేళ్ల పాలనలో గడీని దాటి పంటల దగ్గరికి వెళ్లింది.. వేళ్ల మీద లెక్కపెట్టవచ్చు. గతేడాది ఎలక్షన్స్ టైమ్‌లో బీఆర్ఎస్ సేమ్ ఇలాంటి హడావిడే చేసింది. ఎకరానికి 10 వేల చొప్పున పరిహారం ప్రకటించారు అప్పటి సీఎం కేసీఆర్.. 150 కోట్లు పంపిణీ కూడా చేశారు. మరో 350 కోట్లకు జీవో జారీ చేసినా.. నిధులు మాత్రం విడుదల చేయలేదు. లక్షా 25 వేల ఎకరాల్లో పంట నష్టపోయిన రైతులకు కుచ్చుటోపి పెట్టింది బీఆర్ఎస్ సర్కార్. ఇవన్నీ కౌంటర్లు.. ఎన్‌కౌంటర్లు. అయితే బీఆర్ఎస్ రైతురాగం ఎత్తుకోవడం వెనక అసలు రీజన్స్ వేరే ఉన్నట్టు కనిపిస్తోంది.. లోక్‌సభ ఎన్నికలకు కౌంట్ డౌన్ కంటిన్యూ అవుతోంది. కల్వకుంట్ల కుటుంబాన్ని స్కామ్‌లు.. వాటితో పాటు వస్తున్న కేసులు చుట్టుముడుతున్నాయి. ఇప్పటికే కవిత తీహార్ జైలుకు వెళ్లింది. మరికొందరు కీలక నేతల పేర్లు కేసుల్లో వినిపిస్తున్నాయి.. FIRలలోకి ఎక్కుతున్నాయి. ఇది ఇంటి పరిస్థితి.. ఇక పార్టీ పరిస్థితి అగమ్యగోచరం.. రాత్రి గులాబీ కండువాతో పడుకున్న నేత.. తెల్లారి లేచి ఏ పార్టీ కండువా కప్పుకుంటాడో తెలియని పరిస్థితి.. పిలిచి టికెట్ ఇస్తామన్నా మాకొద్దు బాబోయ్ అంటూ పారిపోతున్నారు. దీనికి తోడు పార్టీ పెద్దల ముందే బూతులు .. కొన్నిసార్లు ఏకంగా దాడులు.. ఇది పార్టీ పరిస్థితి.. ఇక ప్రజల్లో బీఆర్ఎస్‌పై ఉన్న అసహనం తగ్గలేదు. రాష్ట్రంలో పరిస్థితులు మారలేదు. దీంతో కారు పార్టీలో ఉన్న కంగారు అంతా ఇంతా కాదు.

**ఏం చేయాలి? ప్రజల అటెన్షన్ గ్రాబ్ చేయడం ఎలా?** ఏం చేస్తే ప్రజలు పట్టించుకుంటారు? మేడిగడ్డ కుంగుబాటును మరిపించాలంటే ఎలా? కాళేశ్వరం అవినీతిని కనుమరుగు చేయడం ఎలా? గులాబీ నేతల సీటు కిందకు వస్తున్న ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాన్ని. మరిచేలా ఏం చేయాలి? బీఆర్ఎస్ ఖాళీ అవుతుందన్న ఆలోచన నుంచి ప్రజల దృష్టిని ఎలా మరిపించాలి? ఇదిగో ఈ ప్రశ్నల నుంచి వచ్చిందే బీఆర్ఎస్ రైతు పోరాటం.. మరి బీఆర్ఎస్ రైతు పోరాటంలో అయినా చిత్తశుద్ధి ఉందా? అంటే ఆన్సర్ ప్రజలే చెబుతారు. కానీ బీఆర్ఎస్ హయాంలో ఇలాంటి పరిస్థితి వచ్చినప్పుడు.. ఏం జరిగిందో మాత్రం మేం చెబుతాం.. వరి వేస్తే ఉరి.. ఇది కేసీఆర్ సీఎంగా ఆనాడు చెప్పిన మాట.. ధాన్యం కొనడం లేదని రోడ్డెక్కిన రైతును పట్టించుకున్నారా? ఐకేపీ సెంటర్ల ముందు ధాన్యాన్ని పారబోసి కాలబెట్టిన ఆ దిక్కుకైనా చూశారా? అకాల వర్షాలకు పంట నష్టపోయినప్పుడు ఆ దిక్కుకైనా చూశారా? రైతులు ఆత్మహత్యలు చేసుకున్నప్పుడు పట్టించుకున్నారా? లేదు.. మరి అప్పుడు రైతుల ఆవేదనను ఎందుకు గుర్తించలేదు?వారి ఆక్రోశాన్ని ఎందుకు చూసిచూడనట్టు వదిలేశారు? ఇవీ ఇప్పుడు కాంగ్రెస్ నేతలు గులాబీ నేతలకు వేస్తున్న ప్రశ్నలు.. ఇవే కాదు గత కొన్ని రోజులుగా నీటి ఉద్యమాలు అంటూ కొత్త పోరాటానికి దిగారు బీఆర్ఎస్ నేతలు.. ఆనాడు కృష్ణా ప్రాజెక్టులను




పట్టించుకున్న పాపాన పోలేదు.. ప్రాజెక్టులను కేంద్రానికి అప్పగించేందుకు అంగీకరించి.. తర్వాత ఆ నెపాన్ని కాంగ్రెస్ పార్టీపై నెట్టేందుకు ప్రయత్నించారు. కానీ కాంగ్రెస్ కౌంటర్ అటాక్‌తో కారు జోరు తగ్గింది. నిజానికి ఎన్నికలు వచ్చిన ప్రతిసారి బీఆర్ఎస్ సెంటిమెంట్‌ను రగులుస్తోంది. ప్రతి ఎన్నిక ముందు ఇదే సీన్ రీపిట్.. ఈసారి కూడా అదే జరుగుతోంది.. ప్రజలు తెలివైన వారు.. ఒకప్పటిలా నోటి నుంచి వచ్చిందే నిజమనుకునే పరిస్థితిలో లేరు. మాటల వెనుక గుట్టును ఇట్టే పట్టేస్తున్నారు. రాజకీయ రంగును పసిగట్టేస్తున్నారు..

ఈసారి బీఆర్ఎస్ డైవర్ట్ పాలిటిక్స్ అంతగా సక్సెస్ అయ్యే చాన్సెస్ లేవనే చెప్పాలి. ఎందుకంటే కల్వకుంట్ల ఫ్యామిలీపై వస్తున్న ఆరోపణలు.. నమోదవుతున్న కేసులను.. ప్రజలు చాలా కీన్‌గా అబ్జర్వ్ చేస్తున్నారు. పదేళ్ల పాలనలో ఎవరు లాభపడ్డారు? ఎవరు నిండా మునిగారు? అన్నది వారికి ఇప్పటికే అర్థమైపోయింది.



## కేసీఆర్‌తో కేకే భేటీ..

## బీఆర్ఎస్‌కు షాక్ ఇస్తారా?

సిద్దిపేట: ఎన్నికల వేళ తెలంగాణ రాజకీయాల్లో సంచలన మార్పులు చోటుచేసుకుంటున్నాయి. పార్టీ మారుతారనే ప్రచారం జోరుగా సాగుతున్న వేళ బీఆర్ఎస్ జనరల్ సెక్రటరీ కేశవరావు మాజీ సీఎం కేసీఆర్‌తో భేటీ అయ్యారు. ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కేసీఆర్‌ను కలిసిన కేకే పార్టీ మార్పు ప్రచారంపై కేసీఆర్‌కు వివరణ ఇచ్చినట్లు సమాచారం. ఇప్పటికే కాంగ్రెస్‌లో చేరికకు కేకే కూతురు మేయర్ విజయలక్ష్మి రంగం సిద్ధం చేసుకుందనే ప్రచారం జరుగుతోంది. కేకేను కాంగ్రెస్ ఇంఛార్జ్ దీపాదాస్ మున్షీ పార్టీలోకి ఆహ్వానించిన సంగతి తెలిసిందే. దాంతో ఆయన పార్టీ మారుతారనే ప్రచారం జరుగుతోంది.

ఈ నేప థ్యంలో కేసీఆర్‌ను కేకే కలవడం చర్చనీయంగా మారింది. కాగా, రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ కంటే కాంగ్రెస్, బీజేపీకే అధిక సీట్లు వస్తాయంటూ కేకే సంచలన వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. కేసీఆర్‌కు అత్యంత సన్నిహితుడిగా పేరున్న కేకే.. బీఆర్ఎస్ మూడో స్థానంలో ఉండబోతుందంటూ వ్యాఖ్యలు చేయడం రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

# తీగలాగితే... డొంక కదులుతోందా!?

## ఫోన్ ట్యాపింగ్లో మళ్లీ కేసీఆర్ పేరు.. ఈసారి శిష్యుడే..!




### ఫోన్ ట్యాపింగ్ కేస్.. ఇప్పుడు తెలంగాణలో హాట్ టాపిక్.. ఇప్పుడీ కేసులో లింక్స్ అన్ని కలిపితే ఇప్పుడు గులాబీ పెద్దకు చిక్కులు తప్పవా? వాళ్లు వీళ్లు కాదు.. అసలు ముద్దాయి మాజీ సీఎం అని రఘునందన్ రావు ఎందుకంటున్నారు? అసలు మీరేం చేయలేరన్న కేటీఆర్ వ్యాఖ్యల వెనక కాన్ఫిడెన్స్ ఏంటి?

ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం ఇప్పుడు తెలంగాణ పాలిటిక్స్‌ను షేక్ చేస్తోంది. ఎస్సై నుంచి మొదలు పెడితే మాజీ పోలీస్ బాస్‌ల వరకు అందరి ఇన్‌వాల్వ్‌మెంట్ ఉందని.. ఇప్పటికే తేలింది. అయితే వీరంతా పాత్రధారులే.. అసలు సూత్రధారులు వేరే ఉన్నారని మనం ఫస్ట్ నుంచి చెబుతున్నాం. ఇప్పుడు దీన్ని కన్ఫామ్ చేస్తున్నారు బీజేపీ నేత రఘునందన్ రావు.. విన్నారుగా ఆయన డిమాండ్స్.. మొదటి ముద్దాయి కేసీఆర్..రెండో ముద్దాయి హరీష్‌రావు.. ఇదే ఆయన చెబుతున్న మాట.. ఇప్పటికే కాంగ్రెస్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి కంప్లైంట్ చేశారు. ఇప్పుడు బీజేపీ నేత రఘునందన్ రావు కూడా ఆయన బాటలోనే నడిచి.. పోలీసులకు ఫిర్యాదు ఇచ్చారు. నిజానికి రఘునందన్ రావు పోలీసులను ఆశ్రయించారనేది కాస్త ఇంట్రెస్టింగ్ ఇష్యూ.. ఎందుకంటే ఆయన కేవలం పొలిటికల్ లీడర్ మాత్రమే కాదు. ఆయనో అడ్వోకేట్.. కేసులో వివరం.. విషయం లేనిదే ఆయన దిగరు. పక్కా ఆధారాలు లేకుండా ఫిర్యాదు చేసినా దండగే అని ఆయనకు తెలుసు. కానీ ఆయన ముందుకొచ్చి ఫిర్యాదు చేయడం.. ఆరోపణలు చేయడం చూస్తుంటే ఈ కేసులో మరిన్ని సంచలనాలు జరగడం ఖాయంగా కనిపిస్తోంది.

ఇప్పటి వరకు పొలిటిషియన్స్, ఇండస్ట్రియలిస్ట్స్ కే ఫోన్ ట్యాపింగ్ పరిమితం అనుకున్నాం.. కానీ రఘునందన్ ఓ కొత్త విషయాన్ని చెప్పారు. విషయం చెప్పారనడం కన్నా ఓ బాంబ్ పేల్చారని చెప్తే కరెక్టేమో.. ట్యాపింగ్ అనేది పొలిటిషియన్స్‌కు మాత్రమే పరిమితం కాదు. న్యాయమూర్తుల ఫోన్లు కూడా ట్యాప్ అయ్యాయంటున్నారు. ఇదే నిజమైతే అధికారులు, అప్పటి ప్రభుత్వ పెద్దలు పీకల్లోతులో ఇరుక్కుపోయినట్టే.. అంతేకాదు పోలీసులు విచారణ సరిగా చేయకపోతే.. కోర్టు మెట్లెక్కడం ఖాయమన్నారు రఘునందన్ రావు.. ఒక్కసారి కేసీఆర్, హరీష్‌రావు పేర్లతో కేసు రిజిస్టర్ అయితే.. కథ ఇక వేరేలా ఉండటం ఖాయం.. ఇప్పటికే SIB మాజీ చీఫ్ ప్రభాకర్ రావు బుక్కయ్యారు. రాధాకిషన్ రావు కోసం గాలింపు మొదలయ్యింది.. భుజంగరావు, తిరుపతన్న, ప్రణీత్ రావు కటకటాల వెనక్కి వెళ్లారు. మరికొందరు అధికారులను గుర్తించి విచారిస్తున్నారు. ఇప్పటికే కొందరు గులాబీ నేతలను కూడా గుర్తించి నోటీసులను జారీ చేసేందుకు సిద్ధమవుతున్నారు పోలీసులు.. మరి ఇప్పుడు రఘునందన్ రావు ఫిర్యాదుతో కేసీఆర్‌పై కేసు నమోదవుతుందా? లేదా? అన్నది ఇప్పుడు ఇంట్రెస్టింగ్‌గా మారింది. ఫోన్ ట్యాపింగ్‌పై రచ్చ రచ్చ అవుతుంటే.. బీఆర్ఎస్ లీడర్స్ మాత్రం ఎదురు దాడి చేయడమే మార్గం అనుకొంటోంది. అందుకే.. మొదట్లో సైలెంట్‌గా ఉన్నవాళ్లంతా.. సడన్‌గా రూట్ మార్చారు. పార్టీ పరువు పోతుండడంతో రివర్స్ అటాక్ మొదలుపెట్టారు. ట్యాపింగ్ చేశాం.. అయితే ఏంటంట అన్న రేంజ్‌కు కూడా వెళ్లిపోయారు.. ఫోన్ ట్యాపింగ్ చేశారట.. అది కూడా ఒకటో.. రెండో చేసి ఉంటారట. అదే పోలీసుల పనట.. కేటీఆర్ గారూ.. పోలీసులు మావోయిస్టులవో, టెర్రరిస్టులవో ఫోన్లు ట్యాప్ చేసి, దాడులు జరగకుండా అడ్డుకుంటే సీన్ మరోలా ఉండేది. జనమంతా శభాష్ అనేవాళ్లు.. కానీ.. ఆ పనిని వదిలేసి పొలిటికల్ లీడర్ల వెంట పడడం వల్లే ఇష్యూ ఇప్పుడు మీ వరకూ వచ్చింది. మీ మాటలు చూస్తుంటే.. అంటే గుమ్మడికాయల దొంగేవరు అంటే భుజాలు తడుముకున్నట్టుగా లేదు సీన్.. ఆరోపణల్లో వస్తున్న ఫోన్లన్ని చేయలేదు కానీ.. ఏదో ఒకటి, రెండు చేసి ఉండొచ్చు.. అని చెప్పకనే చెబుతూ నిజాన్ని మాత్రం ఒప్పేసుకున్నారు కేటీఆర్.. ఆయన అక్కడితో ఆగలేదు.. చేతిలో అధికారం ఉంది కదా.. దమ్ముంటే చర్యలు తీసుకోండి అంటూ సవాల్ విసురుతున్నారు కేటీఆర్..

**నిజానికి కేటీఆర్ కాన్ఫిడెన్స్ వెనక రీజనేంటి?** దమ్ముంటే చర్యలు తీసుకోండని ఏ ధైర్యంతో సవాళ్లు విసురుతున్నారు? అన్నది కాస్త ఇంట్రెస్ట్‌గా మారింది. ప్రస్తుతం ట్యాప్ చేసిన అధికారులు ఉన్నారు.. కానీ ట్యాప్ చేయమని ఆదేశాలిచ్చిన అధికారులు మాత్రం.. ఇండియాలో లేరు.. వేరే దేశాల్లో తలదాచుకుంటున్నారు. వారు ఇండియాకు ఇప్పట్లో వచ్చే సీన్ కనిపించడం లేదు. అదే కేటీఆర్‌కు కాన్ఫిడెన్స్‌కు కారణమా? వారు వచ్చి విచారణ ఎదుర్కొంటేనే.. వారికి అలా చేయమని ఎవరు చెప్పారో తెలుస్తుంది. అలా తెలిస్తేనే.. పోలీసులకు చర్యలు తీసుకునేందుకు అవకాశం వస్తుంది..

# సంపాదకీయం

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

## టార్గెట్ చేసినోళ్ల ఫోన్లను ఎలా హ్యాక్ చేయొచ్చు?

సంచలనంగా మారిన ఫోన్ ట్యాపింగ్ ఎపిసోడ్ లో ఎన్నికల వేళలో టీపీసీసీ అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్న రేవంత్ రెడ్డి ఇంటికి సమీపంలో ఒక ఆఫీసు సెటప్ చేసి.. అక్కడో ప్రత్యేకమైన డివైజ్ ను ఏర్పాటు చేయటం ద్వారా రేవంత్ ఇంట్లో మాట్లాడుకునే మాటల్ని విన్నట్లుగా సంచలన ఆరోపణలు తెర మీదకు రావటం తెలిసిందే. అదెలా సాధ్యం? దాని వెనుకున్న లాజిక్ ఏంటి? సెల్ ఫోన్ ను హ్యాక్ చేయకుండా.. ఇంట్లో ఉండే ఎలక్ట్రానిక్ డివైజ్ లతో హ్యాక్ చేయటం సాధ్యమేనా? అదెలా వర్కు చేస్తుంది? లాంటి సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ ఉదంతం గురించి కొందరు సైబర్ నిపుణులతో మాట్లాడినప్పుడు.. అలా ట్యాప్ చేయటానికి ఉన్న అవకాశాలు.. దాని సాంకేతికత ఎలా అన్నది వివరిస్తున్నారు. ఇదంతా తెలుసుకున్న తర్వాత.. ఎవరైనా ఎవరినైనా టార్గెట్ చేయాలంటే అంత కష్టమైన పని కాదన్న విషయం అర్థమవుతుంది. ఇంతకూ రేవంత్ ఇంటిని టార్గెట్ చేసిన టెక్నాలజీ ఎలా పని చేసి ఉండొచ్చన్న అంచనాను కొందరు సైబర్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. వారేం చెబుతున్నారంటే.. గతంలో ఎవరైనా ఏదైనా సెల్ ఫోన్ ను ట్యాప్ చేయాలంటే అందులో మాల్ వేర్ ను చొప్పించాల్సి ఉండేది. అయితే.. స్మార్ట్ ఫోన్లలో సెక్యూరిటీ ఫీచర్లు పెరుగుతున్నట్లే.. లొసుగులు కూడా పెరుగుతున్నాయి. ఒకప్పుడు ఫోన్ చేతికి వస్తే తప్పించి వారి ఫోన్ ను హ్యాక్ చేయటం సాధ్యం కాదు. అందులో మాల్ వేర్ జొప్పించకుంటే ఫోన్ లోని సమాచారాన్ని తెలుసుకోవటం సాధ్యమయ్యేది కాదు. అందుకే పలువురు హ్యాకర్లు లింకులు పంపటం.. వాట్సప్ అందుబాటులోకి వచ్చిన తర్వాత ఒక ఫోటోను పంపి.. దాన్ని క్లిక్ చేసినంతనే మాల్ వేర్ ఇన్ స్టాల్ అయ్యేలా చేయొచ్చు. పెగాసెస్ లాంటి స్పైవేర్ లు వచ్చిన తర్వాత స్మార్ట్ ఫోన్ చేతికి రాకున్నా.. స్మార్ట్ ఫోన్ వాడే ఏదైనా నిత్యావసర యాప్ లోని లొసుగుల్ని ఆధారంగా చేసుకొని మాల్ వేర్ ను ఇన్ స్టాల్ చేయొచ్చని చెబుతున్నారు. తాజాగా వెలుగు చూసిన రేవంత్ ఇంటి వద్ద ఏర్పాటు చేసిన డివైజ్ కూడా ఆ తరహాకు చెందినదే అయి ఉంటుందని అంచనా వేస్తున్నారు. రేవంత్ ఇంటికి సమీపంలో ఏర్పాటు చేసినటుగా చెప్పిన ఈ డివైజ్ 300 మీటర్ల పరిధిలో ఉండే నెట్ కనెక్టివిటీ ఉన్న ఎలక్ట్రానిక్ పరికరాల్లోకి చొచ్చుకుపోవటానికి సాయం చేస్తుందంటున్నారు. పబ్లిక్ వైఫైలో ఉంటే హ్యాకర్లుకొన్ని పేలోడ్స్ ద్వారా మొబైల్ ఫోన్లు.. ల్యాప్ టాప్ లలో చొరబతారు. ఇజ్రాయెల్ కు చెందిన సంస్థలు తయారు చేసే టూల్స్ అన్ని రకాల ఆపరేటింగ్ సిస్టమ్ లలో ఉండే లొసుగులు.. వాటిలోకి చొరబడేందుకు దోహదపడే పేలోడ్స్ ఉంటాయి. ఆపరేటింగ్ సిస్టమ్ అప్ గ్రేడ్ అయినా.. కొత్త వెర్షన్ వచ్చినా వెంటనే వాటి ఆప్ డేట్స్ ను ఇజ్రాయెల్ సంస్థలు అందజేస్తాయి. ఇప్పుడు వస్తున్న డివైజ్ లు అన్ని కూడా గ్రాఫిక్ యూజర్ ఇంటర్ ఫేస్ గా యూజర్ ఫ్రెండ్లీగా ఉంటున్నాయని చెబుతున్నారు. మొత్తంగా ఫోన్లలో మాల్ వేర్ జొప్పించకుండా కూడా ట్యాపింగ్ చేసే వీలుందంటున్నారు.

## ఆధారాలు లేకుండా రూ.50 వేలకు మించి నగదు తరలిస్తే సీజ్ చేయండి

### రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి
### గంభీరావుపేట పెద్దమ్మ స్టేజ్ వద్ద చెక్ పోస్టును తనిఖీ చేసిన కలెక్టర్




**గంభీరావుపేట మార్చి 28(ప్రభాత సమాచారం ):** సరైన ఆధారాలు లేకుండా రూ.50 వేలకు మించి నగదును తరలిస్తే సీజ్ చేయాలని, ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు.గురువారం సాయంత్రం అదనపు కలెక్టర్ పి.గౌతమితో కలిసి గంభీరావుపేట మండలం పెద్దమ్మ స్టేజ్ వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్టును కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులో ఉన్నందున కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనల మేరకు చెక్ పోస్టు వద్ద తనిఖీలు పకడ్బందీగా చేపట్టాలని విధుల్లో ఉన్న అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. నిబంధనలకు విరుద్ధంగా రూ.50 వేలకు మించి నగదును సరైన పత్రాలు, ఆధారాలు లేకుండా తరలిస్తే సీజ్ చేయాలన్నారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులో ఉందని, ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని కోరారు. తనిఖీలో గంభీరావుపేట తహశీల్దార్ భూపతి, తదితరులు ఉన్నారు.

## పెట్రోల్ బంకుల్లో కనీస వసతులు కరువు

### సిబ్బంది కొరత...ధనార్జనే ధ్యేయం
### మూలకుపడ్డ ఉచిత గాలి కంప్రెషర్లు
### కానరాని సౌకర్యాలు, సేవలు
### మంచినీటి సౌకర్యం లేని బంకులెన్నో
### అధికారుల తూతూమంత్రపు తనిఖీలు




**గంభీరావుపేట మార్చి 28 (ప్రభాత సమాచారం )** ఓవైపు పెట్రోలు కల్తీ ... మరోవైపు కొలతల్లో తేడాలు...సిబ్బంది కొరత,అంతేకాకుండా కనీస సౌకర్యాలు, కల్పించడంలో పెట్రోల్ బంకుల నిర్వాహకులు ఇష్ట రాజ్యమేలుతున్నారు. గంభీరావుపేట మండలంలోని పెట్రోలు బంకులలో వాహనదారులకు తిప్పలు తప్పడం లేదు.పెట్రోలు బంకుల్లో ఎక్కడా నిబంధనలు పాటించిన దాఖలాలు కనిపించడం లేదు.త్వరగా గమ్యం చేరాలనే వినియోగదారుడి ఆరాటం...అవగాహన లోపం... బంకుల యాజమాన్యాలకు కలసివస్తోంది. ఇదే కల్తీకి...నిబంధనలు పాటించకపోవడానికి ఊతమిస్తోంది.గంభీరావుపేట మండల కేంద్రంలోని ఓ పెట్రోలు బంకులో వాహనాల టైర్లకు గాలి కొట్టే యంత్రం కనిపిస్తుంటుంది. తీరా అక్కడికి వెళితే... గాలి కొట్టే కంప్రెషర్ పనిచేయదు..సిబ్బంది లేరని..గాలి కొట్టడం కుదరదని అక్కడి సిబ్బంది చెబుతారు. మరికొన్ని బంకుల్లో గాలికొట్టే యంత్రాలే కనిపించవు. రహదారిపై ఉన్న బంకుల వద్ద గాలి కొట్టే యంత్రాలు ఉన్నా...సమీపంలో షెడ్ల కింద టైర్లకు పంక్చర్లు వేసే వారి వైపు చూపిస్తారు. అక్కడికి వెళితే వారు ఎంత చెబితే అంత వదిలించుకోవాలి. ఇదీ పెట్రోలు బంకుల వద్ద వినియోగదారుల పరిస్థితి. వాస్తవానికి బంకుల్లో పెట్రోల్, డీజిల్ విక్రయాలే కాదు. వాహన చోదకుడికి అవసరమైన ఎన్నో రకాల సేవలు అందుబాటులో ఉండాలి. అత్యవసర, అనారోగ్య సమయాల్లో ప్రథమ చికిత్స కిట్లు ఉంచాలి. పెట్రోల్ నాణ్యత నిర్ధారణకు 'పేపర్ ఫిల్టర్ టెస్ట్' చేయాలి. మరుగుదొడ్లు, వాష్‌రూమ్‌లను పరిశుభ్రంగా ఉంచాలి. వాహనాల టైర్లకు ఉచితంగా గాలి ఎక్కించాలి..ఇవన్నీ ఫిల్లింగ్ స్టేషన్ల (పెట్రోల్ బంకులు)లో తప్పనిసరి. కానీ ఎక్కడా అమలవుతున్న దాఖలాలు లేవు. కొన్ని బంకుల్లో అయితే కనీసం మంచి నీరు కూడా దొరకదు. పెట్రోల్ పోయించుకొని క్షణాల్లో ముందుకెళ్లాల్సిందే. లేకుంటే అక్కడి సిబ్బంది చిందులేస్తారు. 'ఇష్టముంటే పెట్రోల్ వేయించుకోండి..లేకుంటే వెళ్లిపోండి' అంటూ హుకుం జారీచేస్తారు. పెట్రోల్ బంకుల నిర్వహణ నిబంధనల విషయం చాలామందికి తెలియదు. అక్కడి సిబ్బందికి కూడా అవగాహన లేదు. ధనర్జానే ధ్యేయంగా బంకు యాజమాన్యాలు ఈ నిబంధనలేవీ పాటించడం లేదు. అధికారులు కూడా తూతూమంత్రపు చర్యలకే పరిమితమవుతుండడంతో బంకుల యాజమాన్యాల దోపిడీకి హద్దే లేకుండా పోతోంది.

**తాగు నీరు కరువు**

ప్రధానంగా బంకుల వద్ద తాగునీటి వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. ఎక్కడా శుభ్రత పాటించిన దాఖలాలు లేవు. సాధారణ నీటినే ట్యాంకర్లలో వేసి చేతులు దులుపుకుంటున్నారు. మినరల్ వాటర్‌ను కొన్ని బంకులే అందుబాటులో ఉంచుతున్నాయి. మరుగుదొడ్లు, స్నానపు గదులు ఉన్నవి కొన్నే. అవి కూడా వాహన చోదకులకు ప్రవేశం ఉండదు. నిబంధనల మేరకు నిర్మించిన యాజమాన్యాలు సొంత అవసరాలకు, సిబ్బందికే ఉపయోగిస్తున్నాయి. ఎవరైనా అత్యవసర సమయాల్లో అడుగుతుంటే బయటికి వెళ్లిపోండి అంటూ అక్కడున్న సిబ్బంది బదులిస్తున్నారు. టైర్లకు ఉచితంగా గాలి కొట్టాల్సి ఉన్నా...కేవలం కొద్ది బంకుల్లోనే అమలవుతోంది.

వాస్తవానికి ఏరోజుకారోజు బంకుల వద్ద పెట్రోల్, డీజిల్ ధరలను ప్రదర్శించాలి. పెట్రోల్, డీజిల్‌లో నాణ్యత కొరవడితే ఏ అధికారికి ఫిర్యాదు చేయాలి? ఎవరిని సంప్రదించాలి? వంటి ఫోన్ నంబర్ల వివరాలు నోటీసు బోర్డులో ఉంచాలి. కానీ కొద్ది బంకుల్లోనే ఇటువంటివి పాటిస్తున్నారు. వాస్తవానికి తమ పరిధిలో ఉండే బంకులను తూనికలు కొలతల శాఖ అధికారులతో పాటు స్థానిక రెవెన్యూ సిబ్బంది నిత్యం తనిఖీ చేయాలి. సంబంధిత ఆయిల్ కంపెనీ ప్రతినిధి సైతం సందర్శిస్తుండాలి. పెట్రోల్, డీజిల్ నాణ్యతను ఎప్పటికప్పుడు పరీక్షిస్తుండాలి. కానీ ఇవేవీ జిల్లాలో జరగడం లేదు. అసలు తనిఖీలే ఉండవు. ఎక్కడైనా ఆరోపణలు వచ్చినా... వాహనదారుల నుంచి ఫిర్యాదులు వచ్చినా అధికారులు హడావుడి చేస్తున్నారు. తరువాత ఆ మాటే మరిచిపోతున్నారు. అసలు జిల్లాలో తూనికలు, కొలతల శాఖ ఒకటి ఉందన్న విషయమే తెలియడం లేదు. బయటకు సిబ్బంది కొరత అని సంబంధిత అధికారులు చెబుతున్నారు. కానీ నెలనెలా మామూళ్లు అందడం వల్లనే చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

**–ఆరు రకాల సేవలు తప్పనిసరి**

బంకుల వద్ద ఆరు రకాల సేవలు అందుబాటులో ఉండాలి. లేకుంటే సంబంధిత యాజమాన్యాలపై చర్యలు తీసుకోవచ్చు. వినియోగదారుడికి ఇబ్బందులు తలెత్తితే డీలర్‌షిప్ కూడా రద్దు చేసే అవకాశముంది. కానీ ఈ సేవలపై వినియోగదారులకు అవగాహన ఉండడం లేదు. పెట్రోల్, డీజిల్ నాణ్యతను సరిచూసుకోవచ్చు. బంకుల వద్ద ఫిల్టర్ పేపర్ టెస్ట్ అందుబాటులో ఉంచాలి. ఆ పేపరుపై రెండు మూడు చుక్కలు పెట్రోల్ వేస్తే అది ఆవిరైపోతే నాణ్యత కలిగినదిగా గుర్తించవచ్చు. అదే మరకలుగా మిగిలిపోతే కల్తీ జరిగినట్టు నిర్ధారించవచ్చు. సాధారణంగా పెట్రోల్ బంకులకు సమీపంలో రోడ్డు ప్రమాదాలు జరుగుతుంటాయి. అటువంటి సమయంలో క్షతగాత్రులకు ప్రథమ చికిత్స అవసరం. అందుకే బంకుల వద్ద తప్పనిసరిగా ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందుబాటులో ఉంచాలి. అత్యవసర, అనారోగ్య సమయాల్లో సమాచారం అందించేందుకు బంకుల వద్ద ఫోన్ అందుబాటులో ఉంచాలి. అటువంటి పరిస్థితుల్లో వచ్చిన వారికి అన్నివిధాలా అండగా నిలవాలి. దూర ప్రాంత ప్రయాణికుల కోసం మరుగుదొడ్లు, స్నానపు గదులు అందుబాటులో ఉంచాలి. వాటిని ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలి. ప్రయాణికులకు అసౌకర్యం కలుగకుండా చూసుకునే బాధ్యత యాజమాన్యాలదే. దాహంతో వచ్చేవారికి తప్పకుండా నీరందించాలి. ఇందుకుగాను పరిశుభ్రమైన వాటర్ ఫిల్టర్‌ను ఏర్పాటుచేయాలి. ప్రయాణికులు, వాహన చోదకుల దాహార్తిని తీర్చడమే కాకుండా నీరు బయటకు తీసుకెళ్లేందుకు అవకాశమివ్వాలి. వాహనాలకు సంబంధించి టైర్లకు గాలిని ఉచితంగానే కొట్టాలి. ఇందుకు ఎటువంటి రుసుం తీసుకోకూడదు. ఎక్కడైనా సిబ్బంది డబ్బులు డిమాండ్ చేస్తే యాజమాన్యం చర్యలకు ఉపక్రమించాలి. కానీ సిబ్బంది కొరత సాకుగా చూపుతోనో... యంత్రం సరిగా పనిచేయదనే పేరుతోనో ఎక్కడా గాలిని ఉచితంగా కొట్టే అవకాశం ఉండడం లేదని పెట్రోల్ బంకుల్లో క్రమం తప్పకుండా అధికారులు తనిఖీలు నిర్వహించి వాహనదారులకు కనీస సౌకర్యాలు ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## తప్పిపోయిన బాబును తల్లిదండ్రులకు అప్పజెప్పిన పోలీసులు



**తాండూర్, మార్చి28(ప్రభాత సమాచారం)** తాండూర్ మండలం అచలాపూర్ గ్రామానికి కూలి నిమిత్తం చత్తీస్గడ్ నుండి వచ్చిన రాజేష్ కుమార్ కుమారుడు సుశాంత్ కుమార్ రెండు సంవత్సరాలు పని వద్ద నుండి తప్పిపోయాడని గురువారం తల్లిదండ్రులు గమనించారు.అపుడే తాండూర్ నుండి ఆచలపూర్ వెళున్న ఆచలపూర్ గ్రామవాసి నాగేశ్వర్ రావు ఆ బాలుని తన ఇంటికి తీసుకువెళ్లి భోజనం చేయించారు.అనంతరం ఆయన 100 నంబర్ కు ఫోన్ చేయగా తాండూర్ పోలీసులు వెంటనే స్పందించి అచలాపూర్ రోడ్ వైపు వెళ్లి పోలీసులు, ఆ వ్యక్తి ఇద్దరు కలిసి బాబుని వారి తల్లిదండ్రులకు అప్పజేయడం జరిగింది. తప్పిపోయిన బాలుని కుటుంబ సభ్యులకు అప్పజెప్పినందుకు బాలుని తల్లి తండ్రులు తాండూర్ పోలీసులకు, నాగేశ్వరరావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తాండూర్ పిసి సంతోష్ పాల్గొన్నారు.

## వక్ఫ్ బోర్డు చైర్మన్ అజ్మతుల్లా హుస్సేని ని కలసిన మేకల కమలాకర్



**గంభీరావుపేట (సిరిసిల్ల)మార్చి 28(ప్రభాత సమాచారం ):** హైదరాబాద్ హజ్ భవన్ లో గంభీరావుపేట మండల కేంద్రానికి చెందిన తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అజ్మతుల్లా హుస్సేని తెలంగాణ రాష్ట్ర వక్ఫ్ బోర్డ్ చైర్మన్ గానియమితులైన సందర్భంగా తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర జాయింట్ కన్వీనర్ ఎస్సీ విభాగం మేకల కమలాకర్ మర్యాద పూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కమలాకర్ మాట్లాడుతూ వక్ఫ్ బోర్డు చైర్మన్ గా నియమితులైన అజ్మతుల్లా హుస్సేని తన మంచి స్నేహితుడు అని తను స్నేహితుడికి ఇంత మంచి హోదా రావడం గర్వంగా ఉందని సంతోష వ్యక్తం చేసారు.

## గ్రామాల్లో బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు...ఎస్సై ధనశ్రీ




**తలమడుగు మార్చ్ 28(ప్రభాత సమాచారం)** గ్రామాలు ఎన్నికల కోడ్ ఉల్లంఘించి బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై ధనశ్రీ అన్నారు.. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ప్రస్తుతం పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమ్మలో ఉన్నందున.. ఎవరు కూడా గ్రామాల్లో మద్యం. కల్తీకల్లు. ఇతర మత్తు పదార్థాలు. విక్రయించవద్దన్నారు.. అదేవిధంగా ఎన్నికల అధికల ఆదేశాల మేరకు.. ఎవరు కూడా 50 వేలకు పైగా. నగదు తీసుకెళ్లవద్దన్నారు. గ్రామాల్లో ఎవరైనా మద్యం విక్రయించినట్లు తెలిస్తే వెంటనే సమాచారం అందించాలని సూచించారు.. ఇందులో పోలీస్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# పిల్లులు, పిచ్చుకలు.. కరెంటుకు కొత్త చిక్కులు!

హైదరాబాద్: నగరంలో విద్యుత్తు పంపిణీ వ్యవస్థకి సరికొత్త చిక్కొచ్చి పడింది. అనుకోని అతిథులు ఉప కేంద్రాల్లోని పవర్ ట్రాన్స్‌ఫార్మర్, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లలోకి ప్రవేశించి సరఫరా వ్యవస్థకు ఊహించని నష్టం కలిగిస్తున్నాయి. పిల్లులు, పిచ్చుకలు, బల్లులు.. విద్యుత్తు సిబ్బంది, అధికారులను ఉరుకులు పరుగులు పెట్టిస్తున్నాయి. 11కేవీలో తరచూ, 33కేవీలో అరుదుగా బ్రేక్‌డౌన్లకు కారణమవుతున్నాయి. మంగళవారం ఇలాంటి ఘటనే మీర్‌పేట నందనవనం విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలో జరిగింది. అక్కడున్న 33కేవీ ఉపకేంద్రంలో ఉదయం బ్రేక్‌డౌన్ అయ్యింది. పవర్ ట్రాన్స్‌ఫార్మర్ (పీటీఆర్) మీద నుంచి పిల్లి దూకడాన్ని సబ్‌స్టేషన్ ఆపరేటర్ గమనించారు. సబ్‌స్టేషన్ నుంచి కాలనీలకు సరఫరా అయ్యే బ్రేకర్ లింబ్‌పై పిల్లి దూకడంతో బ్రేక్‌డౌన్ సమస్య తలెత్తినట్లు ఇంజినీర్లు తెలిపారు. ప్రత్యామ్నాయ సరఫరాతో 15 నుంచి 20 నిమిషాల్లో కొన్ని కాలనీలకు కరెంటు పునరుద్ధరించారు. మిగిలినవాటికి దాదాపు



గంట సమయం పట్టింది. పిల్లి కాలికి గాయమైంది.

గతంలోనూ తరచూ..

పిచ్చుకలు, బల్లులు, పాములవంటి మూగజీవాలతో 11కేవీ ఫీడర్లలో తరచూ సమస్యలు ఎదురవుతున్నాయని సిబ్బంది చెబుతున్నారు. జైన్ మందిర్ ఫీడర్‌లో పక్షి పడటంతో కరెంటు సరఫరా నిలిచిపోయింది. కొత్తపేట ఉప కేంద్రంలో పరిధిలో ఒక ట్రాన్స్‌ఫార్మర్ ఇన్సులేటర్‌పై పక్షి వాలడంతో ఫీడర్ బ్రేక్‌డౌన్ అయ్యింది. బల్లులతో లైన్ ట్రిప్ అయిన ఉదంతాలు ఈ వేసవిలోనే పలుచోట్ల జరిగాయి. ఇటీవల ఒక ట్రాన్స్‌ఫార్మర్‌పై పాము పాకుతున్న వీడియో సైతం వైరలైంది. చాలావరకు ఓవర్‌హెడ్ తీగలే కావడంతో వాతావరణ మార్పులు, ప్రకృతి విపత్తుల సమయంలో తీవ్రంగా ప్రభావితమవుతున్నాయి. ఈదురుగాలులు వీచినప్పుడు, వర్షాలు కురిసినప్పుడు, అధిక ఉష్ణోగ్రతలకు ఓవర్‌లోడ్‌తో సమస్యలు తలెత్తుతున్నాయి. ఇప్పుడు మూగజీవాలతో కొత్త సమస్య ఎదురవుతోంది.

# ఇదేం కర్మ..!

ఖమ్మం : ప్రభుత్వ ఆధ్వర్యంలో ఆర్భాటంగా ప్రారంభమైన దేశీయ సంప్రదాయ వైద్య సేవలు అటకెక్కాయి. ప్రజల నుంచి స్పందన కన్పిస్తున్నా.. ప్రభుత్వ విభాగాల్లో ఆయుర్వేద, యునానీ, హోమియోపతి, నేచురోపతి, యోగా వంటి వైద్య సేవలు నామమాత్రంగా మారాయి. అధికార యంత్రాంగం నిర్లక్ష్యంతో రోగులకు ఆశించిన స్థాయిలో వైద్యం లభించడం లేదు. సిబ్బంది నియామకాలు, మౌలిక సదుపాయాల కల్పనలో తీవ్ర అలసత్వం నెలకొంది. ఫలితంగా ఖమ్మం జిల్లా కేంద్రంలో పంచకర్మ సేవలు పూర్తిగా నిలిచిపోయాయి.

ఖమ్మం సర్వజనాసుపత్రిలో 2014లో ఆయుష్ ఆసుపత్రిలో పది పడకల సామర్థ్యంతో పంచకర్మ విభాగాన్ని ఏర్పాటు చేశారు. రోగులకు కొంతకాలం వరకు చికిత్సలు అందించి ఆ తర్వాత పూర్తిగా నిలిపివేశారు. దీర్ఘకాలిక చికిత్స అవసరమైన రోగుల్ని చేర్చుకుని పంచకర్మ సేవల్లో భాగంగా స్టీమ్ బాత్, మర్దనం తదితర ప్రక్రియల ద్వారా సేవలందించాలి. దీనికి సంబంధించిన పడకలు, పరికరాలు తీసుకొచ్చి మూలనపడేశారు. కొన్నిరోజులు అవి ఇలాగే ఉంటే ఎందుకూ పనికిరాకుండా పోతాయి. పంచకర్మ సేవలకు అవసరమైన వార్డులను ఏర్పాటు చేసేందుకు తగిన భవనం లేకపోవడంతో ఈ దుస్థితి నెలకొంది. భవనం కొరత దృష్ట్యా ఔట్ పేషంట్ సేవలకు మాత్రమే చికిత్స అందిస్తూ ఇన్‌పేషంట్లను చేర్చుకోవడం లేదు. ఆస్పత్రి ఆవరణలోని ఓ క్వార్టర్‌లో నామమాత్రంగా ఓపీ సేవలు కొనసాగిస్తున్నారు.

మిగిలిన చోట్లా..

జిల్లాలో 19 ఆయుష్ ఆస్పత్రులున్నాయి. ప్రతి ఆసుపత్రిలో వైద్యాధికారి, ఫార్మసిస్ట్, నర్సింగ్ స్టాఫ్ ఉండాలి. ఆయా వైద్యశాలల్లో 12 మెడికల్ ఆఫీసర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఫార్మసిస్టు, నర్సింగ్ స్టాఫ్ పోస్టులు పూర్తి స్థాయిలో భర్తీ కాలేదు. ప్రతి ఆస్పత్రికి అనుబంధంగా హెల్త్ వెల్‌నెస్ సెంటర్ల పేరుతో ఎన్ఆర్‌హెచ్ఎం కింద విడుదలైన నిధులను వెచ్చించి 19 యోగా షెడ్లు నిర్మించారు. ఒక్కో షెడ్డుకు రూ.6 లక్షలు ఖర్చు చేశారు. ఏళ్లు గడుస్తున్నా నిపుణుల(ఇన్‌స్ట్రక్టర్లు)ను నియమించలేదు. ఉభయ జిల్లాల్లో ఇదే పరిస్థితి. దీంతో యోగా తరగతుల నిర్వహణకు ఉద్దేశించిన సామగ్రి దెబ్బతింది. రాష్ట్ర స్థాయిలోనే నియామకాలు చేపట్టాలని స్థానిక అధికారులు చెబుతున్నారు.

"ఆయుష్ ఆస్పత్రుల్లో సమస్యలను ఉన్నతాధికారులకు నివేదించాం. ఖాళీల భర్తీకి చర్యలు చేపడతాం. హెల్త్ వెల్‌నెస్ సెంటర్లను అందుబాటులోకి తీసుకువచ్చి సేవలందిస్తాం. ఖాళీ పోస్టులను భర్తీ చేసి చికిత్సలను కొనసాగిస్తాం."డాక్టర్ రవినాయక్, ఆయుష్ ప్రాంతీయ సహాయ సంచాలకులు.

# సీతారామ పనులకు గ్రహణం

ఖమ్మం: ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలను సస్యశ్యామలం చేయాలనే లక్ష్యంతో చేపట్టిన సీతారామ ప్రాజెక్టుకు మళ్లీ గ్రహణం పట్టింది. పర్యవేక్షణ కొరవడటమే దీనికి కారణమని తెలుస్తోంది. 12వ ప్యాకేజీ వరకు కొంతమేర ముందడుగు కనిపిస్తున్నప్పటికీ, ఆతర్వాత నాలుగు ప్యాకేజీలతో చేపట్టిన పాలేరు అనుసంధాన కాల్వ పనుల్లో అంతులేని నిర్లక్ష్యం కనిపిస్తోంది. రాజకీయ ఒత్తిళ్లో, బిల్లులు మంజూరుకాకపోవటమో తెలియదు కానీ గుత్తేదారు నిర్దాక్షిణ్యంగా ఎక్కడి పనులు అక్కడే వదిలేసి వెళ్లిపోవటంతో ఈ సమస్య తలెత్తింది.2017లో మొదలు 2017లో సీతారామ ప్రాజెక్టు పనులకు అప్పటి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఖమ్మం, భద్రాద్రి జిల్లాలో ప్రధాన కాల్వ, సత్తుపల్లి ట్రంకు, పాలేరు ట్రంక్ అనే మూడు విభాగాలుగా ఈ ప్రాజెక్టును విభజించి పనులు చేపట్టింది. భద్రాద్రి జిల్లాలో కొంతమేర పురోగతి ఉన్నప్పటికీ ఖమ్మం జిల్లాలో అతీగతీ లేకుండా పోయింది. సత్తుపల్లి ట్రంకులో 9 నుంచి 12 వరకు ప్యాకేజీలు ఉన్నాయి. ఈ పనులు ఇప్పటివరకు 35 శాతం పూర్తయ్యాయి. పాలేరు ట్రంకును 13, 14, 15, 16 ప్యాకేజీలుగా విభజించి పనులు చేపట్టారు. దీనిలో కాల్వల పొడవు 79 కి.మీ. ఆయకట్టు లక్ష్యం దాదాపు లక్ష ఎకరాలు. ఏన్కూరు నుంచి కారేపల్లి, డోర్నకల్, తిరుమలాయపాలెం, కూసుమంచి మండలాల మీదుగా పాలేరుకు చేరుకుంటుంది. 13, 14, 15, 16 ప్యాకేజీల పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టే మారాయి. 17, 18 ప్యాకేజీల్లో భాగంగా డిస్ట్రిబ్యూటరీ కాల్వల ద్వారా కామేపల్లి, కారేపల్లి, ఇల్లెందు, ఏన్కూరు మండలాలకు సాగునీరందించాలన్న లక్ష్యం ఉన్నప్పటికీ అసలు పనుల ఊసేలేదు. 13వ ప్యాకేజీ పనులు టెండర్ దశ దాటలేదు.

# ధ్యానం ద్వారానే మానసిక ప్రశాంతత జెడ్పిటిసి గోక గణేష్ రెడ్డి





**తలమడుగు మార్చ్ 28(ప్రభాత సమాచారం)**

తలమడుగు మండలంలోని పులాజి బాబా ధ్యాన మందిర కేంద్రం ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం ధ్యాన సభ్యుల నివాసాలలో సప్త కార్యక్రమాలు నిర్వహిస్తూ ధ్యాన సభ్యులను ఆకర్షిస్తున్నారు, అందులో భాగంగానే ఈ మొదటి సప్త కార్యక్రమాన్ని కాటిపేల్లి సునీత రెడ్డి వెంకట్ రెడ్డి, నివాసంలో ఏర్పాటు చేయగా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జెడ్పిటిసి గోక గణేష్ రెడ్డి హాజరై , ప్రసంగించారు ఈ సందర్భంగా జెడ్పిటిసి మాట్లాడుతూ గత 26 సంవత్సరాల క్రితం కాటిపల్లి చిన దేవరెడ్డి పులాజి బాబా ధ్యాన మందిర కేంద్రాన్ని స్థాపించారని, ఆ రోజుల్లో ప్రజలలో ధ్యానం గురించి అవగాహన తక్కువగా ఉండేది అన్నారు,ఎన్నో కష్టాలను ఎదుర్కొని , ధ్యాన మందిర కేంద్రాన్ని కొనసాగిస్తూ వచ్చారని, ఈరోజు ధ్యాన మందిర కేంద్రానికి కొన్ని వందల మంది రావడం చాలా ఆనందంగా ఉందన్నారు తాను కూడా నిరంతరం వాకింగ్ చేస్తానని కానీ తనకు షుగర్, బీపీ వ్యాధులు ఉన్నందున డాక్టర్ను సంప్రదిస్తే, మీరు ధ్యానం చేయాలని వెల్లడించినట్లు తెలిపారుతాను కూడా ధ్యాన సభ్యుడిగా చేరుతానని, ఈ సందర్భంగా ఆయన తెలిపారు ధ్యాన మందిర కేంద్రం సభ్యులు విన్నపం మేరకు మందిరంలో బోరు వేయించానని,మోటర్ ని కూడా తానే అందజేస్తానని జడ్పిటిసి గోక గణేష్ రెడ్డి తెలిపారు,ఈ సందర్భంగా ఆయనకు శాలువాతో సన్మానించి సత్కరించారు, అనంతరం సీనియర్ పిరమిడ్ మాస్టర్ సునీత వెంకట్ మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ. ధ్యానం తో పాటు ఆధ్యాత్మిక మార్గంలో నడుచుకొని.. మహాత్ములు రచించిన. జీవిత గాథలను చదవాలని సూచించారు ఈ కార్యక్రమంలో ధ్యాన మందిర కేంద్రం అధ్యక్షుడు కాటి పెల్లి సురేష్ రెడ్డి, ఉపాధ్యక్షులు నీలగిరి అశోక్, పిరమిడ్ మాస్టర్ సునీత, ధ్యాన సభ్యులు తదితరులు ఉన్నారు

# ప్రశాంతంగా మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉపఎన్నిక పోలింగ్

### 100 శాతం పోలింగ్ నమోదు


### కొడంగల్ లో ఓటేసిన సీఎం రేవంత్ రెడ్డి

**మహబూబ్‌నగర్ మార్చి 28(ప్రభాత సమాచారం)**

మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉపఎన్నిక పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఉమ్మడి పాలమూరు జిల్లావ్యాప్తంగా 14 నియోజకవర్గాల్లో 10 కేంద్రాల్లో పోలింగ్ నిర్వహించారు. ఈ ఉప ఎన్నికలో వంద శాతం పోలింగ్ నమోదైనట్లు ఏఆర్వో వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొడంగల్‌లో, మంత్రి జూపల్లి కృష్ణారావు కొల్లాపూర్‌లో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి రాజీనామా చేయడంతో, ఆ స్థానం భర్తీకి నిర్వహించిన ఉప ఎన్నిక ప్రశాంతంగా ముగిసింది. 100 శాతం పోలింగ్ నమోదు అయినట్లు ఏఆర్వో వెల్లడించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లావ్యాప్తంగా ప్రజాప్రతినిధులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ ఉప ఎన్నికకు ముగ్గురు అభ్యర్థులు బరిలో నిలిచారు.వీరిలో కాంగ్రెస్ నుంచి మన్నె జీవన్‌రెడ్డి, బీఆర్ఎస్ నుంచి నవీన్ కుమార్ రెడ్డి, స్వతంత్ర అభ్యర్థి సుదర్శన్ గౌడ్ పోటీ చేశారు. ఇద్దరు ఎంపీలు, 14 మంది శాసనసభ్యులు, ముగ్గురు ఎమ్మెల్సీలు, 888 మంది ఎంపీటీసీలు, 83 మంది జడ్పీటీసీలు, 449 మంది కౌన్సిలర్లు కలిపి మొత్తం 1,439 మంది ఓటర్లు, తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. కొడంగల్ ఎంపీడీవో కార్యాలయంలో సీఎం రేవంత్? రెడ్డి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.ఈ ఉప ఎన్నికను అధికార కాంగ్రెస్ పార్టీ, బీఆర్ఎస్ ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. వచ్చే నెల ఏప్రిల్ 2న ఓట్ల లెక్కింపు జరగనుంది. ఈ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్య ఓటు, రెండో ప్రాధాన్య ఓటు, మూడో ప్రాధాన్య ఓటు ఉంటుంది. మొత్తం పోలైన ఓట్లలో, మొదటి ప్రాధాన్యత ఓట్లను తొలుత లెక్కిస్తారు. పోలైన ఓట్లలో మొదటి ప్రాధాన్యత ఓట్లు సగం కంటే ఒక్క ఓటు అదనంగా వచ్చినా, ఆ అభ్యర్థి మొదటి రౌండ్‌లో విజయం సాధిస్తారు.అందుకే ప్రధాన పార్టీల అభ్యర్థులు తమ ప్రచారంలో భాగంగా తొలి ప్రాధాన్య ఓటు మాత్రమే వేయాలని అభ్యర్థించారు.

పోలింగ్ ముగిసిన తర్వాత అన్ని పోలింగ్ కేంద్రాల నుంచి బ్యాలెట్ పెట్టెలను మహబూబ్‌నగర్ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల స్ట్రాంగ్ రూంలో భద్రపరిచారు.సీఎం రేవంత్‌రెడ్డి తన ఓటు హక్కు వినియోగించుకున్న అనంతరం కొడంగల్‌లో కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా 'ఓటు చాలా విలువైనది. ఎన్నికలు వస్తే సెలవులొస్తాయి, తీర్థయాత్రకు వెళ్దాం అనుకుంటారు. ఎన్ని కార్యక్రమాలున్నా ఓటు వేసేందుకు కొడంగల్ వచ్చాను. కార్యకర్తలను కలవాలని కొడంగల్ వచ్చాను. నేను కష్టాల్లో ఉన్నప్పుడు కొడంగల్ ప్రజలు నా వెంట ఉన్నారు. నేను ప్రచారానికి రాకున్నా, నన్ను గెలిపించారు' అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

# చెరువులకు చెర !



కరీంనగర్ :కరీంనగర్‌కు ఆనుకుని ఉన్న తీగలగుట్టపల్లి, ఆరెపల్లి సమీపంలోని ఓ రెండు కుంటలు కాలక్రమేణా కనుమరుగైపోయాయి. వీటితోపాటు స్థిరాస్తి వ్యాపారుల వల్ల ఇక్కడి మాలకుంట కుంచించుకుపోయింది. ఇదే తరహాలో ఉడతకుంట, అవుసుల కుంటలు కబ్జా కోరల్లో చిక్కుకున్నాయి. తీగలగుట్టపల్లి ప్రధాన రహదారి పక్కనే ఉన్న ఊరకుంటలోనూ ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మాణాలు జరిగాయని ఉన్నతాధికారులకు ఫిర్యాదులందాయి. ఇక్కడి 8.2 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న భూమిని ఎలాగైనా తమ వశం చేసుకోవడానికి కొంతమంది ప్రయత్నిస్తున్నారు.

బొమ్మకల్ భూ మాఫియా ఆగడాల వల్ల ఇక్కడి పెద్ద చెరువులకు 'చెర' తప్పలేదు. ఇక్కడ వందలాది ఎకరాలు పరుల వశమైనట్లే.. ఇక్కడి విలువైన చెరువుల్లోనూ దర్జాగా కబ్జాకాండ కొనసాగింది. జక్కప్ప చెరువు (46.21 ఎకరాలు), రావికుంట (9.10 ఎకరాలు), గోపాల్ చెరువు (28.10 ఎకరాలు), నల్ల చెరువు (16.10 ఎకరాలు), గోదుమకుంట (12 ఎకరాలు).. ఇలా ముఖ్యమైన వాటన్నింటికి ముప్పు ఎదురైంది. చాలాచోట్ల వీటి శిఖం స్థలాల్లో అక్రమ నిర్మాణాలు జరిగాయి. ఇవేకాకుండా రెండు మూడు చిన్న కుంటలు మాయమై అందులో స్థిరాస్తి వ్యాపారం సాగుతోంది.

కరీంనగర్ చుట్టే కాదు.. జిల్లాలోని పలు మండలాల్లోనూ చెరువుల కబ్జాకు ప్రయత్నిస్తున్నారు. పక్కనే ఉన్న భూములే ఆసరాగా అక్రమణలకు పాల్పడుతున్నారు. జిల్లా కలెక్టర్‌కు ప్రజావాణిలో వస్తున్న అర్జీల్లో చెరువులు, కుంటల ఆక్రమణపైనే ఎక్కువ. ఇటీవల గంగాధర మండలం గర్శకుర్తి ఊర చెరువులో దాదాపుగా 2 ఎకరాల స్థలంలో మట్టిని నింపారని గ్రామానికి చెందిన మత్స్యకారుల సంఘం ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. నీళ్లు నిలిచి ఉండే స్థానంలో మట్టి నింపడంతో ఇబ్బంది కలుగుతోందని ఫిర్యాదులో పేర్కొన్నారు.

భూముల ధరలకు రెక్కలు రావడంతో ప్రభుత్వ భూములతోపాటు చెరువులపై కొందరు స్థిరాస్తి వ్యాపారులు కన్నేస్తున్నారు. రూ.కోట్లు సంపాదించడానికి సులువైన మార్గం కావడం.. అధికారులను, నాయకులను మచ్చిక చేసుకుంటే సరిపోవడంతో జల వనరులను ఆక్రమించేస్తున్నారు. కరీంనగర్, జమ్మికుంట, హుజూరాబాద్, చొప్పదండి, గంగాధరలాంటి ప్రాంతాల్లో గుంట ధర రూ.15- రూ.20 లక్షలు పలుకుతుండటంతో పాత దస్త్రాలను తారుమారు చేసి వీటిని శిఖం పట్టాగా మార్చుకుంటున్నారు. సమీపంలో వెంచర్ల ఏర్పాటుతో కొందరు వ్యాపారులు మెల్లిగా తమ జాగాలో వీటి సరిహద్దులను కలిపేసుకుంటున్నారు. నిబంధనల్ని అతిక్రమించి చెరువుకు నీరందించే కాలువల రూపురేఖల్నే మారేస్తున్నారు.

సం'రక్షణ' లేకనే..!

కబ్జా కాకుండా కాపాడే విషయంలో జిల్లాలో స్పష్టంగా లోపాలు కనిపిస్తున్నాయి. ఏళ్ల తరబడి ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందుతున్నా.. చర్యలు తీసుకున్న దాఖలాలు తక్కువగానే ఉంటున్నాయి. రాజకీయ ఒత్తిళ్లు, ఇతరత్రా ప్రలోభాల ఎరతో యంత్రాంగం చూసీచూడనట్లు వ్యవహరిస్తోందనే ఆరోపణలున్నాయి.

హైకోర్టు ఇటీవల జల వనరుల కబ్జాలపై స్పందించింది. చెరువుల ఆక్రమణల్ని తీవ్రంగా పరిగణించాలని.. లేదంటే భవిష్యత్తు తరాలు మనల్ని క్షమించవని వ్యాఖ్యలు చేసింది. ఎఫ్‌టీఎల్ (ఫుల్ ట్యాంక్ లెవల్)లో నిర్మాణాలు, మట్టితో పూడ్చడం, కట్టలను తొలగించడంపై దృష్టి పెట్టాలని, కఠిన చర్యలుండాలని ఆదేశించింది.

కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా చెరువులు, కుంటలన్నీ కలిపి 1008 ఉంటాయి. దాదాపుగా 13,456.91 హెక్టార్లలో వీటి విస్తీర్ణం ఉంటుంది. పెద్ద చెరువులకు కొద్దిగా ముప్పు తక్కువగా ఉన్నా.. చిన్న కుంటలు మాత్రం చాలా చోట్ల ఆక్రమణలకు గురయ్యాయి. ఎక్కడా హెచ్చరిక బోర్డులు లేక కబ్జా కోరులకు చిక్కాయి.

సర్వే చేయించి చర్యలుజిల్లాలో చెరువుల ఆక్రమణలపై ప్రత్యేక దృష్టి పెడతాం. ప్రస్తుతం చెరువులో నీటిమట్టం తగ్గడం వల్ల నీటి నిల్వ స్థాయిని (ఎఫ్‌టీఎల్) గుర్తించేందుకు సర్వే చేయిస్తామని ఇటీవలే ఉన్నతాధికారులకు లేఖ రాశాం. ఆదేశాలు రాగానే అన్ని చెరువులపై ఒక నివేదికను తయారు చేసి సంరక్షణకు చర్యలు తీసుకుంటాం.

- శివకుమార్, ఎస్ఈ, నీటిపారుదలశాఖ

# ఓయూ బీకాం.. ఉపాధికి ఊతం

హైదరాబాద్: మెట్రో నగరాలతో పాటు ద్వితీయ శ్రేణి పట్టణాల్లోనూ ఐటీ, బహుళజాతి సంస్థలు, ఈ-కామర్స్ కంపెనీలు ఏర్పాటవుతున్నాయి. దేశవ్యాప్తంగా 30లక్షల మంది ఆర్థిక నిపుణులు అవసరం ఉన్నట్లు నివేదికలు తెలియజేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం, అనుబంధ కళాశాలల్లో బీకాం పూర్తి చేసిన విద్యార్థులకు వెంటనే ఉపాధి అవకాశాలు కల్పించేలా ముందడుగు వేసింది. ఇందుకోసం దిల్లీకి చెందిన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఛార్టెర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియాతో ఇటీవల ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా కామర్స్‌లోనూ కృత్రిమ మేధ తదితర అంశాలతో పాఠ్యప్రణాళికను ఓయూ, ఐసీఏఐ ప్రతినిధులు రూపొందించారు. దీంతో విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందని వర్సిటీ వర్గాలు చెబుతున్నాయి.

వర్సిటీ నుంచే ఎక్కువ..

ఓయూతో పాటు 450 అనుబంధ డిగ్రీ కళాశాలల్లో ఏటా 40వేల మంది విద్యార్థులు బీకాం కోర్సులో చేరుతున్నారు.

బీకాం పూర్తి చేస్తున్న విద్యార్థుల్లో 70 శాతం మంది డిగ్రీ పూర్తి కాగానే ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగులుగా చేరుతున్నారు. 20శాతం మంది ఎంకాం కోర్సుల్లో చేరుతున్నారు.



నగరంలో 14వేల మంది సీఏలు ఉంటే వారిలో 13వేల మంది ఓయూలో చదువుకున్న వారే.

ఆర్థిక నిపుణులయ్యేందుకు అవకాశం

- ప్రొఫెసర్ డి.చెన్నప్ప, కామర్స్ విభాగం, ఓయూ

బీకాం పూర్తిచేసిన విద్యార్థుల్లో 40 శాతం మంది సీఏ కోర్సులో చేరేందుకు వెనకాడుతున్నారు. తాజాగా ఏడాదికి మూడు సార్లు పరీక్షలు రాసేందుకు అవకాశం లభించడంతో ఎక్కువ మంది ఆసక్తి చూపే అవకాశం ఉంది. ఫలితంగా వచ్చే మూడేళ్లలో సీఏ కోర్సుల్లో చేరేవారి సంఖ్య 30శాతం పెరుగుతుందని అంచనా వేస్తున్నాం. ఐటీ సంస్థల కార్యకలాపాలు పెరుగుతుండటం, కొత్తగా బహుళజాతి సంస్థలు, పరిశ్రమలు వస్తుండడంతో బీకాం, ఎంకాం చదివిన వారందరికీ ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

# టెట్‌కు టిక్.. టిక్..


పాల్వంచ : రాష్ట్ర ప్రభుత్వం మెగా డీఎస్సీ ప్రకటించింది. గత సర్కారు 2023లో విడుదల చేసిన ప్రకటనను రద్దుపరిచి.. అప్పటి పోస్టులకు మరిన్ని ఖాళీలను కలిపి ఇటీవల నోటిఫికేషన్ వెలువరించిన విషయం విదితమే. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని డీఎడ్, బీఎడ్ అభ్యసించి.. ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్)లో ఉత్తీర్ణత సాధించేందుకు వేలాది మంది నిరుద్యోగులు యత్నిస్తున్నారు.

టెట్ ఉత్తీర్ణత తప్పనిసరి

మరోవైపు జీహెచ్ఎం (గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయులు)లకు స్కూల్ అసిస్టెంట్, బదిలీ, ఉద్యోగోన్నతులు, సెకండరీ గ్రేడ్ టీచర్ల(ఎస్‌జీటీ)కు 'లో ఫిమేల్ లిటరసీ ప్రధానోపాధ్యాయులు (ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంలు), స్కూల్ అసిస్టెంట్లుగా ఉద్యోగోన్నతి కల్పించేందుకు 'టెట్' ఉత్తీర్ణత తప్పనిసరి అని జాతీయ విద్యా పరిశోధన శిక్షణ మండలి(ఎన్‌సీఈఆర్‌టీ) 2023 సెప్టెంబర్‌లో స్పష్టం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల టెట్ ప్రకటన వెలువరించినా.. ఉపాధ్యాయులు ఈ పరీక్ష రాయాలా? వద్దా? అనేదానిపై మార్గదర్శకాలు జారీ చేయలేదు. అందుకే ఉపాధ్యాయ వర్గాల్లో సందిగ్ధం నెలకొంది. టెట్‌కు బుధవారం నుంచి దరఖాస్తులను సర్కారు స్వీకరిస్తుంది. గతంలో టెట్ ఆఫ్‌లైన్‌లో జరిగేది. ఈసారి ఆన్‌లైన్‌లో నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

ఇటీవల షెడ్యూల్ విడుదల

విద్యాశాఖ పది రోజుల క్రితమే టెట్ షెడ్యూల్ విడుదల చేస్తూ ఉత్తర్వులు వెలువరించింది. మార్చి 27 నుంచి ఏప్రిల్ 10 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనుంది. మే 20 నుంచి జూన్ 3 వరకు ఆన్‌లైన్ విధానంలో పరీక్షలు నిర్వహించనుంది. గతేడాది పరీక్ష కఠినంగా ఉండటంతో చాలామంది ఉత్తీర్ణత సాధించలేదు. దీంతో ఈసారి పోటీ అధికంగా ఉంటుంది. నిరుద్యోగులతో పాటు ప్రభుత్వ ఉపాధ్యాయులూ సిద్ధమవుతున్నారు.



మరింత స్పష్టత అవసరం

అయితే ప్రభుత్వ ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతి కోసం సర్కారు ఎలాంటి ప్రకటన చేయకపోవటంతో స్పష్టత లోపించింది. ఉత్తర్వు-36లోని 12వ కాలమ్‌లో 2010 కంటే ముందు సర్వీసులో నియమితులైన ఉపాధ్యాయులకు అవసరం లేదనే విషయాన్ని ప్రభుత్వం తొలగించింది. ఉపాధ్యాయులందరూ ఉద్యోగోన్నతులకు రాయాలని పరోక్షంగా సూచించింది. కనీసం ఎస్జీటీలు ఏ పేపర్ రాయాలి, ఎస్ఏలు ఏ పేపర్ రాయాలో ప్రకటించలేదని ఉపాధ్యాయులు వాపోతున్నారు. న్యాయపరమైన చిక్కులు రాకుండా ఇచ్చిన ప్రకటనలో ఉపాధ్యాయులకు కూడా కొన్ని మార్గదర్శకాలు జారీ చేస్తే బాగుండేదని అభిప్రాయపడుతున్నారు. వీరి కోసం ప్రత్యేక పరీక్ష నిర్వహిస్తే మేలు అని ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

ప్రభుత్వ ఉపాధ్యాయులు ఉద్యోగోన్నతి పొందాలంటే కచ్చితంగా టెట్ రాయాల్సిందే. రాష్ట్ర ప్రభుత్వం దీనిపై స్పష్టతతో ఉంది. ఎన్‌సీఈఆర్‌టీ సైతం టెట్ తప్పనిసరి చేసింది. కాబట్టి ఎవరైతే ఉద్యోగోన్నతి కావాలనుకుంటున్నారో ఆ ఉపాధ్యాయులందరూ టెట్‌కు సిద్ధం కావాల్సిందే. పేపర్-1ను ఎస్జీటీలు, పేపర్-2ను ఎస్ఏలు రాయాల్సి ఉంటుంది. అలుగుబెల్లి నర్సిరెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ




## గండిపేటలో భారీ అగ్ని ప్రమాదం.. దగ్ధమైన 25 కార్లు..

రంగారెడ్డి, మార్చి 28: రంగారెడ్డి జిల్లా గండిపేటలో భారీ అగ్ని ప్రమాదంసంభవించింది. ఖానాపూర్‌లో ఓ కార్ల గోదాంలో భారీగా మంటలు చెలరేగాయి. అగ్ని కీలలు ఎగసిపడుతున్నాయి. ఈ ప్రమాదంలో గోదాంలో ఉన్న కార్లన్నీ మంటల్లో చిక్కుకున్నాయి. గోదాంలో 25 కార్లు ఉండగా.. అవన్నీ పూర్తిగా దగ్ధమయ్యాయి. భారీ మంటల కారణంగా నల్లటి పొగ దట్టంగా వ్యాపించింది. పొగతో స్థానిక ప్రజలు తీవ్ర భయభ్రాంతులకు గురయ్యారు. ప్రమాదానికి షార్ట్ సర్క్యూట్ కారణం అని స్థానికులు చెబుతున్నారు. కాగా, ప్రమాదంపై సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది.. ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. అగ్ని ప్రమాదంపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. ప్రమాదానికి గల కారణాలను నిర్ధారించే పనిలో పడ్డారు.

## మేడిపల్లి పీఎస్‌లో బండి సంజయ్‌పై కేసు



మేడ్చల్ జిల్లా: మేడిపల్లి పోలీస్ స్టేషన్‌లో బండి సంజయ్‌పై కేసు నమోదైంది. చెంగిచర్లలో పిట్టల బస్తి బాధితులను పరామర్శించడానికి బండి సంజయ్, అతని అనుచరులు రాగా, పోలీసులకు, బీజేపీ నాయకులకు మధ్య వాగ్వాదం, తోపులాట చోటు చేసుకుంది. తోపులాటలో కింద పడిన నాచారం సీఐ నందిశ్వర్ రెడ్డికి గాయాలయ్యాయి. సీఐ ఫిర్యాదుతో బండి సంజయ్‌తో పాటు మరో పది మందిపై 332, 353, 143, 149 ఐపీసీ 3, 4పీడీపీపీఏ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

## కాంగ్రెస్ నిర్లక్ష్య విధానాలతో ఆగమైపోతున్న రైతులు: కేటీఆర్



సిరిసిల్ల: కాంగ్రెస్ పార్టీ నిర్లక్ష్య విధానాల వల్ల రైతులు ఆగమైపోతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. రాష్ట్రంలో 15 నుంచి 20 లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోతున్నాయని చెప్పారు. ఇది కాలం తెచ్చిన కరువు కాదని కాంగ్రెస్ తెచ్చిన కరువన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని సారంపల్లిలో ఇటీవల వడగండ్ల వానకు నష్టపోయిన పంటలను కేటీఆర్ పరిశీలించారు. పంటల నష్టంపై రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. రైతుల్లో భరోసా నిపండానికి క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నామని తెలిపారు. డిసెంబర్ 9న రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ చెప్పిందని, ఇప్పటిరకు చేయలేదని విమర్శించారు. రైతుబంధుకు కేసీఆర్ సర్కార్ రూ.7 వేల కోట్లు సిద్ధంచేసిందని, కానీ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసి పంటసాయాన్ని ఆపిందని చెప్పారు. తాము రైతుల కోసం ఉంచిన డబ్బులను కాంగ్రెస్ పార్టీ కాంట్రాక్టర్లకు ఇచ్చిందన్నారు. కౌలు రైతులకు కూడా రైతుభరోసా ఇస్తామని రేవంత్ రెడ్డి చెప్పారని, చివరికి వారిని కూడా మోసం చేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. మేడిగడ్డలో కుంగిన మూడు పిల్లర్లను రిపేర్ చేయడానికి రేవంత్ రెడ్డికి చేతకావడం లేదని విమర్శించారు.

## కేసీఆర్ ఇలాకాలో బీఆర్ఎస్‌కు భారీ షాక్

సిద్దిపేట జిల్లా: మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు ఇలాకాలో బీఆర్ఎస్ (%దీ=ా%)కు భారీ షాక్ తగిలింది. కొండపాక మండలం, ఎంపీపీ పీఠాన్ని కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంది. ప్రస్తుత ఎంపీపీ ర్యాగల సుగుణ దుర్గయ్యపై అవిశ్వాసం నెగ్గింది. దీంతో కొండపాక మండలానికి చెందిన మంచాల అనసూయ కనకరాములు ఎంపీపీగా ఎన్నిక అయ్యారు. ఆరుగురు బీఆర్ఎస్, ఇద్దరు కాంగ్రెస్, ఒక్క బీజేపీ ఎంపీటీసీలు కలిసి నూతనంగా ఎంపీపీగా కొండపాకకు చెందిన మంచాల అనసూయ కనకరాములును ఎన్నుకున్నారు.

## రెండో విడుత నోటిఫికేషన్ విడుదల... 88 పార్లమెంట్ స్థానాల్లో నామినేషన్లు షురూ

న్యూఢిల్లీ: సార్వత్రిక సమరంలో రెండో విడుత ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైంది. సుదీర్ఘంగా సాగుతున్న లోక్‌సభ ఎన్నికల్లో ఇప్పటికే మొదటి విడుత నామినేషన్ల గుడువు ముగిసింది. గురువారం ఉదయం రెండో దశ ఎన్నికల్లో భాగంగా 88 స్థానాలకు నోటిఫికేషన్‌ను ఈసీ విడుదల చేసింది. వెంటనే నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. రెండో విడుతలో ఔటర్ మణిపూర్‌లోని ఒక సీటుతోపాటు దేశవ్యాప్తంగా 12 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని ఎంపీ స్థానాల్లో ఏప్రిల్ 26న పోలింగ్ జరుగనుంది. ఏప్రిల్ 4 వరకు నామినేషన్లు దాఖలు చేయవచ్చు. జమ్ము కశ్మీర్ మినహా 11 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు సంబంధించిన నామినేషన్ల పరిశీలన ఏప్రిల్ 5న జరుగనుంది. జమ్మలో మాత్రం ఏప్రిల్ 6న నామపత్రాలను పరిశీలించనున్నారు. రెండో విడతలో అస్సాం, బీహార్, ఛత్తీస్‌గఢ్, జమ్ముకశ్మీర్, కర్ణాటక, కేరళ, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, రాజస్తాన్, త్రిపుర, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్, మణిపూర్‌లో ఎన్నికలు జరుగనున్నాయి. వీటితోపాటు మహారాష్ట్రలోని అకోలా పశ్చిమ అసెంబ్లీ నియోజకవర్గం, రాజస్తాన్‌లోని భాగిడోరా అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నికలు జరుగుతాయి. కాగా, మొదటి విడుత నోటిఫికేషన్‌ను మార్చి 20న విడుదల చేసిన విషయం తెలిసిందే. మొత్తం 102 ఎంపీ స్థానాలకు ఏప్రిల్ 19న ఎన్నికలు జరుగనున్నాయి.

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక
విలేకరులు కావలెను...
తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో బ్యూరో ఇంచార్జీలు, స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జీలు, డివిజన్ ఇంచార్జీలతో పాటు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. ఆసక్తి కలిగిన వారు సంప్రదించండి.
సయ్యద్ కరీం ఎడిటర్
9440977660, 9110718194




## ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం

హైదరాబాద్, మార్చి 28: తెలంగాణలో పెను సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో తవ్వే కొద్దీ సంచలన విషయాలు బయటికొస్తున్నాయి. ఇప్పటికే దర్యాప్తులో కీలక విషయాలను రాబట్టిన ఉన్నతాధికారులు మరింత వేగం పెంచారు. ఈ కేసులో మరో ఇద్దర్ని.. పోలీసులు అదుపులోనికి తీసుకున్నారు. బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఆ ఇద్దర్నీ పోలీసు అధికారులు విచారిస్తున్నారు. కాగా ఈ ఇద్దరు కూడా పోలీసు అధికారులే కావడం గమనార్హం. బుధవారం రాత్రి అధికారులను అదుపులోనికి తీసుకున్న పోలీసులు.. లోతుగా విచారణ చేపడుతున్నారు. ముఖ్యంగా.. ఈ కేసులో నిందితుడైన ప్రణీత్‌రావుతో ఉన్న సంబంధాలపై దర్యాప్తు బృందం ఆరా తీస్తోంది. ఇవాళ అంతా విచారించి.. ఆ ఇద్దరు అధికారులను అరెస్ట్ చేసే అవకాశాలు మెండుగా ఉన్నాయి. కాగా.. ప్రణీత్‌కు సహకరించిన ప్రతి ఒక్కర్నీ విచారించాలని దర్యాప్తు బృందం యోచిస్తున్నట్లుగా తెలుస్తోంది. మరోవైపు.. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై అధికార కాంగ్రెస్, ప్రతిపక్షాల మధ్య తీవ్ర స్థాయిలోనే మాటల యుద్ధం జరుగుతోంది.

**డీసీపీ పేరు వెలుగులోకి! :** స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్(ఎస్ఐబీ) కేంద్రంగా సాగిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం ఇప్పుడు శివారు కమిషనరేట్‌నూ తాకిన సంగతి తెలిసిందే. ఇప్పటికే హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ డీసీపీగా పనిచేసిన రాధాకిషన్‌రావు పేరు వెలుగులోకి రాగా.. తాజాగా శివారు కమిషనరేట్‌లో టాస్క్‌ఫోర్స్ మాదిరి విభాగానికి(ఎస్‌వోటీ) ఇన్‌చార్జిగా వ్యవహరించిన డీసీపీ పాత్రను దర్యాప్తు అధికారులు గుర్తించారు. నాన్-క్యాడర్ అధికారే అయినా.. ఆయన ఆ కమిషనరేట్‌లో రియల్ ఎస్టేట్ పరంగా అత్యంత కీలకమైన దాదాపు అన్ని జోన్లకు డీసీపీగా పనిచేసినట్లు సమాచారం. సదరు అధికారి తన టీమ్‌తో కలిసి రూ.కోట్లలో అక్రమ వసూళ్లకు పాల్పడినట్లు పంజాగుట్ట పోలీసులు అనుమానిస్తున్నారు.

**15 మంది సంగతేంటి..? :** రియల్ ఎస్టేట్ పరంగా కీలకమైన జోన్లు కావడంతో.. ప్రభుత్వ పెద్దలు చెప్పినట్లు భూదందాలు, సెటిల్‌మెంట్లు చేసి, విధేయతను చాటుకున్నారని సమాచారం. సదరు డీసీపీ గత ప్రభుత్వ పెద్దలకు సమీప బంధువు కావడంతో.. సీపీ స్థాయి అధికారి కూడా ఆయన చర్యలను పెద్దగా పట్టించుకునేవారు కాదని భావిస్తున్నారు. ఎస్ఐబీలో సేవలందించిన 15 మంది అధికారులు, సిబ్బందికి ఈ కేసుతో సంబంధాలున్నట్లు దర్యాప్తు అధికారులు గుర్తించారు. వీరంతా ఏళ్ల తరబడి ఇంటెలిజెన్స్‌లో పాతుకుపోయినట్లు తెలుస్తోంది. కొందరైతే ఎస్పీ, డీఎస్పీ స్థాయిలో పదవీ విరమణ చేసినా.. ఓఎస్డీలుగా కొనసాగారు. ట్యాపింగ్ వ్యవహారంలో వీరు కూడా కీలక పాత్రధారులు అని తెలుస్తోంది. ఎస్ఐబీ కేంద్రంగా సాగిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం పక్క రాష్ట్రాలను కూడా తాకినట్లు దర్యాప్తు అధికారులు గుర్తించారు. మరోవైపు.. ఫోన్ ట్యాపింగ్ కేసులో బాధితులు ఒక్కొక్కరుగా బయటకు వస్తున్నారు.

## సీఎం రేవంత్ రెడ్డితో ఎస్వీ కృష్ణారెడ్డి, అచ్చిరెడ్డి భేటీ



చిత్ర పరిశ్రమలో ఆదర్శ మిత్రులు, అగ్రశ్రేణి దర్శక నిర్మాతలుగా పేరు పొందిన ఎస్వీ కృష్ణారెడ్డి – అచ్చిరెడ్డి ద్వయానికి రాజకీయాల పట్ల ఎలాంటి ఆసక్తి లేకపోయినప్పటికీ పలువురు రాజకీయ ప్రముఖులతో సత్సంబంధాలు ఉన్నాయి.

పార్టీలకు అతీతంగా రాజకీయ నాయకులందరితో అనుబంధం ఉన్నప్పటికీ వారు ఎప్పుడూ రాజకీయ వేదికలపై కనిపించలేదు. అయితే ఇటీవల వీరిద్దరూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.




హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు భారాసను ఓడించి శిక్ష విధించినా ఆ పార్టీ నేతలు అహంకారాన్ని వీడటం లేదని భాజపా ఎంపీ లక్ష్మణ్ విమర్శించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. నియంతృత్వాన్ని పాటించే వాళ్లు నీడను కూడా నమ్మరన్నారు. కేసీఆర్ కూడా ఎవరినీ నమ్మలేదని.. అందుకే రాజకీయ, మీడియా ప్రముఖులపై ఫోన్ ట్యాపింగ్ చేయించారని ఆరోపించారు. "కేంద్ర హెూం శాఖ అనుమతి లేకుండా ఫోన్ ట్యాపింగ్ చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో హార్డ్ డిస్కులు, సమాచారాన్ని ధ్వంసం చేశారు. రెండో, మూడో ఫోన్ ట్యాపింగ్‌లు జరిగితే జరగవచ్చని కేటీఆర్ అంటున్నారు. దీనికి మూల కారకులు కేసీఆర్, కేటీఆర్. సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి దీనిపై సీబీఐ విచారణ చేయించాలి. మద్యం కుంభకోణంలో కవిత పాత్ర ఉంది. ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరం ప్రాజెక్టు అవకతవకల్లో ఆ కుటుంబానికి ప్రమేయముంది. తెలంగాణ సంపదను దోచకున్న వారికి శిక్ష పడాలని ప్రజలు కోరుకుంటున్నారు. సీఎంగా ఉన్నప్పుడు కేసీఆర్ ఫామ్ హౌస్ నుంచి కదలలేదు. సచివాలయానికి ఒక్కసారి కూడా వెళ్లలేదు. గత ప్రభుత్వంలో ప్రతి పథకంలో స్కామ్‌లు చేశారు.. కమీషన్లు తీసుకున్నారు. ప్రశ్నించే వారిని బెదిరింపులకు గురి చేశారు. నియంతృత్వ పోకడలు సాగించారు. కక్ష సాధింపులో భాగంగా పలువురిపై ఫోన్ ట్యాపింగ్ చేశారు. అసెంబ్లీ, ఉప ఎన్నికల సమయంలో రాజకీయంగా లబ్ధి పొందేందుకు ప్రయత్నించారు. ఈ కుంభకోణంలో కొంత మంది పోలీసు అధికారులు ఏ రకంగా అక్రమార్జనకు పాల్పడ్డారో ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. కేసీఆర్ ప్రభుత్వం పౌరుల వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగించింది. ఇది తీవ్రమైన నేరం" అని లక్ష్మణ్ ఆరోపించారు.

## బల్కంపేట ఎల్లమ్మను దర్శించుకున్న నీతా అంబానీ



హైదరాబాద్: రిలయన్స్ అధినేత ముఖేష్ అంబానీ సతీమణి, ఐపీఎల్ ముంబై ఇండియన్స్ టీం యజమాని నీతా అంబానీ బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. హైదరాబాద్‌లో ముంబై ఇండియన్స్ మ్యాచ్ ఎప్పుడు జరిగినా నీతాఅంబానీ ఎల్లమ్మను దర్శించుకొని స్టేడియానికి వెళుతుంటారు. నీతా అంబానీకి ఆలయ ఈవో కుంట నాగరాజు, చైర్మన్ కొత్తపల్లి సాయిగౌడ్‌లు స్వాగతం పలికారు.

## శ్రీశైలం ఆలయంలో సామూహిక అభిషేకాలు రద్దు..

నంద్యాల: శ్రీశైలం ఆలయంలో స్వామివారి గర్భాలయ సామూహిక అభిషేకాలను దేవస్థానం తాత్కాలికంగా రద్దు చేసింది. అమ్మవారి ఆలయంలో కుంకుమార్చన పూజలు కూడా రద్దు చేశారు. ఏప్రిల్ 6 నుంచి 10 వరకు శ్రీశైలంలో ఉగాది మహెూత్సవాలు జరగనున్నాయి. ఉగాది మహెూత్సవాల సందర్భంగా శ్రీశైలం ఆలయంలో స్వామి అమ్మవార్ల అభిషేకాలు.. కుంకుమార్చన పూజలు నేటి నుంచే నిలిపివేశారు. శ్రీశైలం దేవస్థానం వెబ్‌సైట్‌లో ఆన్ లైన్ సేవా టికెట్లు స్వామి అమ్మవార్ల గర్భాలయ అభిషేకాలు.. సామూహిక అభిషేకాల టికెట్లు ఆన్ లైన్‌లో లేకపోవడంతో భక్తులు అయోమయానికి గురవుతున్నారు. ముందస్తుగా స్వామివారి గర్భాలయ అభిషేకాలు నిలుపుదల చేస్తున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించకపోవడమే గందరగోళానికి దారితీసింది. ఇవాళ్టి నుంచి స్వామివారి విఐపి బ్రేక్ దర్శనాలు.. స్వామివారి గర్భాలయ స్పర్శ దర్శనాలకు విడతలవారీగా భక్తులను అనుమతించనున్నారు. రోజుకు నాలుగు విడతలుగా ఏప్రిల్ 5 వరకు భక్తులకు అనుమతి లభించనుంది. ఏప్రిల్ 6 నుంచి 10 వరకు శ్రీశై లం ఆలయంలో స్వామివారి స్పర్శ దర్శనాలు.. విఐపి బ్రేక్ దర్శనాలు కూడా దేవస్థానం రద్దు చేసింది. భక్తులందరికీ అలంకార దర్శనానికి మాత్రమే అనుమతి లభించనుంది. భక్తుల రద్దీకి అనుగుణంగా స్వామివారి దర్శనం వేళల్లో దేవస్థానం మార్పులు చేసింది.

PRINTED, PUBLISHED, EDITED AND OWNED BY SYED. KAREEM. PRINTED AT MUZAMMIL PRINTERS BOKKALGUDA, ADILABAD-504001
PUBLISHED AT D.NO. 4-4-122/10/B, VIDYANAGER, ADILABAD - 504001. TELANGANA STATE, REGD. NO. APTEL/2011/41055 ìEDITOR : SYED. KAREEMî CELL - 94409 77660